క్లుప్తంగా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రామకృష్ణ

టెక్కలి రూరల్: రానున్న దసరా పండుగకు సెలవుల్లో దూరప్రాంతాలకు వెళ్లే వారు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ కోరారు. ఆదివారం అయ్యప్పనగర్‌లో స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కుటుంబంతో సహా దూరప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లలో డబ్బులు, బంగారం వంటి విలువైన వస్తువులు ఉంచి ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

నిరుపేదకు ఆర్థిక సాయం



పాపమ్మకు సాయం అందిస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన బచ్చు పాపమ్మకు ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగింది. చికిత్సకు సైతం ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో స్పెసెల్ గాయ్స్ ఫౌండేషన్(ఎస్‌జీఎఫ్) సభ్యులు స్పందించారు. ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు



స్తంభాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధిలో కేటీ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా విద్యుత్ పనులను మున్సిపల్ కమిషనర్ టి.నాగంద్రకుమార్ ఆదివారం పరిశీలించారు. పాత విద్యుత్ స్తంభాల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించారు. స్తంభాల తొలగింపు పనులను రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఆయనతో పాటు లైన్ ఇన్స్పెక్టర్ గార రాజారావు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



మూలిపాడులో వీధులను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ వెంకటరావు

మందస: మండలంలోని పలు పంచాయతీల్లో ఆదివారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. మూలిపాడు, కొత్తపల్లి, మందస పంచాయతీల్లో సర్పంచ్‌లు గుసిరి వెంకటరావు, సేనాపతి దివ్య, చెరుకుపల్లి యల్లమ్మ ఆధ్వర్యంలో చెత్తా, చెదారం తొలగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, యువజన కార్యదర్శి శానాపతి కిషోర్‌కుమార్, సేనాపతి ప్రకాశరావు, మామిడి కృష్ణారావు, గొరహరిమహంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం నేత కొల్లి సత్యం మృతికి సంతాపం



కొల్లి సత్యం(ఫైల్)

మందస: సీపీఎం సీనియర్ నాయకుడు కొల్లి సత్యనారాయణ(సత్యం మాస్టారు) విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. 84 ఏళ్ల సత్యం ప్రజా పోరాటాల్లో ముందుండేవారు. మందసలో ఉంటూ, పలాస, సోంపేట, మందస ప్రాంతాల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాలను నడిపారు. ఆయన భార్య సరోజని కూడా యూటీఎఫ్‌లో సుదీర్ఘకాలం పాటు చురుకైన పాత్ర పోషించారు. ఈ ప్రాంతంలోని కార్మిక, కర్షక సంఘాలకు సత్యం దిక్సూచిగా ఉండేవారు. సుమారు 8 ఏళ్లు జైలు జీవితం గడిపారు. సత్యం మాస్టారు మనువరాళ్లు విశాఖలో ఉద్యోగాలు చేస్తుండటంతో ప్రస్తుతం వారి దగ్గరే ఉంటున్నారు. సత్యం మృతి పట్ల సీపీఎం, సీఐటీయూ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

10న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

సోంపేట: విద్యుత్ శాఖ సోంపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 10న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పలాస డివిజన్ ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మ బి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి హాజరై సమస్యలు విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

అన్నదాతకు ఆసరాగా..!



వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటలో రైతు భరోసా కేంద్రం



పలాస మండలం అల్లుకోలలో రైతు భరోసా కేంద్రం

- శరవేగంగా ఆర్బీకేల నిర్మాణం
- పలాస నియోజకవర్గంలో 71 కేంద్రాలకు రూ.15.48 కోట్లు
- ఇప్పటికే పెద్ద ఎత్తున యూరియా, డీఏపీ పంపిణీ
- తుది దశలో ఈ- క్రాప్ బుకింగ్

వజ్రపుకొత్తూరు: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలకు శ్రీకారం చుట్టారు. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తున్న ఈ కేంద్రాల నిర్మాణం పలాస నియోజకవర్గంలో శరవేగంగా సాగుతోంది. భవన నిర్మాణాలతో పాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని సర్దుబాటు చేస్తోంది. అవసరమైన చోట వ్యవసాయ శాఖ సిబ్బంది ఖాళీలను భర్తీ చేసి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తోంది. పురుగు మందులు, ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తోంది. మెరుగైన దిగుబడులు సాధించేందుకు కొత్త రకం వంగడాలను సైతం అందిస్తోంది.

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం..

పలాస నియోజకవర్గంలో ఆర్బీకేల నిర్మాణం ఉద్యమంలా సాగుతోంది. రూ.15.48 కోట్లతో 71 ఆర్బీకేలు నిర్మిస్తున్నారు. అందులో వజ్రపుకొత్తూరులో 26 , పలాసలో 16, మందసలో 29 రైతు భరోసా కేంద్రాలను మంజూరు చేసింది. ఇందులో 26 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరో 30 ఆర్బీకేలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక శ్లాబ్ లెవిల్‌లో ఐదు కేంద్రాలు, బేస్‌మెంట్ దశలో 10 కేంద్రాలు ఉన్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ జి.రవిబాబు తెలిపారు.

రైతు చెంతకే ఎరువులు..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతు వద్దకే ఎరువులను పంపిణీ చేస్తోంది. అందుకు ఆర్బీకేలు వేదికగా నిలుస్తున్నాయి. పలాస వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో యూరియా 2065 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1500 మెట్రిక్ టన్నులు ఎంఓపీ 75 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 75 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీ చేశారు. ఇవి కాకుండా రైతులకు పకృతి విపత్తుల నుంచి సహాయం పొందేందుకు, ఫలసాయాన్ని మద్దతు ధరకు అమ్ముకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తోంది. 74079 ఎకరాల సాధారణ విస్తీర్ణం, మరో 6వేల ఎకరాల ఆర్ఓఎఫ్ఆర్ విస్తీర్ణంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పూర్తి చేసింది.

ప్రాధాన్యతా క్రమంలో..



71 కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 56 కేంద్రాల నిర్మాణం పూర్తయి బిల్లులు చెల్లించాం. మరో 15 కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 90 శాతం మేర ఆర్బీకేలు వ్యవసాయ శాఖకు అప్పగించాం. ప్రస్తుతం అందులోనే వ్యవసాయ శాఖ విధులు నిర్వహిస్తోంది.

– జి.రవిబాబు, డీఈఈ, పంచాయతీరాజ్, పలాస

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రతి రైతుకు ఆర్బీకేల ద్వారా సబ్సిడీతో ఎరువులను పంపిణీ చేస్తున్నాం. రైతులకు ఎరువులు, సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. పలాస సబ్ డివిజన్‌లో ఈ - క్రాప్ బుకింగ్ 98 శాతం మేర పూర్తి చేశాం.

– ఎల్.వి.మధు, ఏడీఏ, పలాస

పేదల సంక్షేమమే ధ్యేయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం డిగొనపపుట్టుగ సచివాలయం పరిధి ఆర్.భైరిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లపాలనలో ప్రభుత్వం ద్వారా చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక సమస్యల్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సనపల శ్రీనివాస్, పిరియా ఆనందరావు, పుల్లట రాంప్రసాద్, పిరియా వైకుంఠరావు, మాదిన శ్రీనివాసరావు, కడియాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు నాయకుల పయనం



టెక్కలి: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి టెక్కలి నియోజకవర్గం నాయకులు ఆదివారం పయనమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ ఎ.సరోజనమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు బి.హరి, టి.ఫల్గుణరావు, జె.బాబూరావు, ఎస్.సత్యరాజ్, జేసీఎస్ ఇన్‌చార్జిలు, నాయకులు రమేష్, మోహన్‌రెడ్డి, అప్పలరెడ్డి, కామేష్, శ్రీను, భీమారావు, జయరాం, రామకృష్ణ తదితరులు బయలుదేరి వెళ్లారు. సమన్వయకర్త దువ్వాడ వాణి జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

ఇచ్ఛాపురం: విజయవాడలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ నుంచి ముఖ్య నేతలు ఆదివారం పయనమయ్యారు. పార్టీపెద్దల ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు తాడి ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, పట్టణ అధ్యక్షుడు బలివాడ ప్రకాశ పట్నాయక్, మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లీలు ఇచ్ఛాపురం రైలు నిలయం నుంచి విజయవాడకు ప్రయాణమయ్యారు.



ఇచ్ఛాపురం: సభకు బయలు దేరిన పార్టీనాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాశీబుగ్గ: పలాస పట్టణంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని లైన్ ఇన్స్పెక్టర్ గార రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్చుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

దేశ వ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలి

టెక్కలి: దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కులగణన వలన అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం రావడంతో పాటు పరిపాలన, విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన హక్కులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. బీహార్‌లో బీసీ కుల ఆధారిత సర్వేను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈదుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రత్న ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల వద్ద జరిగే శిబిరానికి తరలివచ్చి వైద్యసేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

మందస: మండలంలోని గిరిజన పంచాయతీ కొండలోగాం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, సర్పంచ్ సవర రోజా, ఎంపీటీసీ సవర ఢిల్లేశ్వరి చెప్పారు.

సోంపేట: మామిడిపల్లి సచివాలయం-2 పరిధిలోని రాజాంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.హరికిరణ్ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఆవరణలో శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికత కలిగి ఉండాలి

టెక్కలి రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత కలిగి ఉండాలని పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎస్.వి.రమణ అన్నారు. ఆదివారం రావివలస శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద గేదెల చంద్రశేఖర్ అధ్యక్షతను దివ్య జీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సంపూర్ణ శరణాగతి కలిగి ఉండాలన్నారు. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాలంటే ఆధ్యాత్మిక మార్గమే శరణ్యమన్నారు. సమావేశంలో దివ్య జీవన సత్సంగ సమావేశ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టెక్కలి రూరల్: మండలంలోని పెద్దసాన గ్రామానికి చెందిన ఇప్పిలి అచ్చమ్మ(45) ఆదివారం మృతిచెందింది. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చమ్మ కొంత కాలంగా కాళ్లు చేతులు తిమ్మర్ల వ్యాధితో బాధపడుతుండేది. ఈ నెల 3న నొప్పులు అధికమవడంతో ఆ బాధను తట్టుకోలేక ఎక్కువగా మాత్రలు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే భర్త ప్రకాష్ ఆమెను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు టెక్కలి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

అల్లుఖోలలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ



పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని అల్లుఖోల సచివాలయంలో సర్పంచ్ దువ్వాడ వామాక్షి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన భూ సర్వేకు పట్టాదారు పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి, వార్డు సభ్యులు జి.సత్యం, పి.తారక్, ఆర్.భాగ్యలక్ష్మి, సచివాలయ కన్వీనర్ ఈదు శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



ఎంపీటీసీ బమ్మిడి దుర్యోధనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి స్వాగతం పలుకుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఆశయ సాధనకు పలాస నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీతో కలిసి పనిచేస్తానని చినంచల స్వతంత్ర ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గం గతం కంటే ఎన్నోరెట్లు అభివృద్ధి చెందిందన్నారు. ఒక విద్యావంతుడు నాయకుడైతే అభివృద్ధి ఎలా పరుగులు తీస్తుందో మంత్రి అప్పలరాజు చేసి చూపించారని చెప్పారు. తన ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి మరింతగా పనిచేసేందుకు చినంచల ప్రాదేశికం నుంచి 150 మందితో వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అభివృద్ధి సాధకుడైన సీదిరి అప్పలరాజుతో కలిసి పనిచేస్తానన్నారు.



సభకు హాజరైన పార్టీ శ్రేణులు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నాయకుడు నెయ్యిల శివ కూడా మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పనిచేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పనిచేసేందుకు 50 మందితో కలిసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. పలాస నియోజకవర్గంలో అప్పలరాజును మళ్లీ గెలిపించేందుకు శాయశక్తులా పనిచేస్తానని చెప్పారు.



మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువనేత నెయ్యిల శివకుమార్, నాయకులు

ఉద్దానంలో కదం తొక్కిన మహిళలు

పలాస: మండలంలోని ఉద్దానం గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం మహిళలు ఆదివారం కదం తొక్కారు. మహిహిళల హక్కుల కోసం నినాదాలు చేస్తూ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. కాశీబుగ్గలో రెండు రోజులుగా మహిళలు హక్కులు–వారి జీవన విధానం తదితర అంశాలపై రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద అమరులకు నివాళులు అర్పించారు. ప్రముఖ విప్లవ కవి, అమర వీరుడు సుబ్బారావు పాణిగ్రాహి సతీమణిని కలిసి విప్లవ అభివందనాలు తెలియజేశారు. ఆ కుటుంబ త్యాగాలను కీర్తించారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.విష్ణు, రాష్ట్ర నాయకులు ఈశ్వరి, బి.పద్మ, ఏసమ్మ, సి.పి.ఐ.ఎం.ఎల్. న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వంకల మాధవరావు, ఎం.వినోద్, భీమ్‌శంకర్, సోమేశ్వరరావు, రామారావు, జుత్తు వీరాస్వామి తదిరతరులు పాల్గొన్నారు.



బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద నివాళులు అర్పిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



సొండిపూడి హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు

మందస: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి. విద్యార్థుల వద్దకే వెళ్లి, ప్రభుత్వ విద్య ఆవశ్యకతను మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వివరిస్తున్నారు. ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు ఆధ్వర్యంలో వారం రోజులుగా పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లి 10వ తరగతి అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతున్నారు. గతంలో కళాశాల పరిస్థితి, నాడు-నేడుతో నేటి అభివృద్ధిని వివరిస్తున్నారు. ఆధునిక మరుగుదొడ్లు, ఆర్ఓ వాటర్‌ప్లాంట్, మోడ్రన్ లైబ్రరీ, వెయిటింగ్ హాల్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నిష్ణాతులైన అధ్యాపకులున్నారని, ప్రభుత్వం తరఫున అన్ని సదుపాయాలు, పథకాలు కూడా వర్తిస్తాయన్నారు. గత ఏడాది మంచి ఫలితాలు సాధించామని, జగనన్న ఆణిముత్యాలకు విద్యార్థులు ఎంపికయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సివిక్స్, ఒకేషనల్ అధ్యాపకులు హనుమంతు విజయలక్ష్మి, సాప నరేష్, ఉపాధ్యాయులు బి.సుందరసాల్మన్, నగిరి కరుణాకర్ పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

కాశీబుగ్గ/మందస: పలాస, మందస మండలా పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఉక్కపోతకు గురిచేసిన వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మేఘావృతమై వానపడింది. దుగులు, ఉరుములతో సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.



వర్షం నీటిని పంటపొలానికి దారి మళ్లిస్తున్న చిన్నారులు